క్లుప్తంగా

సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు ఏర్పాట్లు



అనివేటి మండపంలో వ్రతాలకు ఏర్పాటు చేసిన వేదిక

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రంలో శుక్రవారం నిర్వహించనున్న వరలక్ష్మీ వ్రతాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆఖరి శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని దేవస్థానం అధికారులు వ్రత వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోని అనివేటి మండపాన్ని గురువారం సిబ్బంది సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అలాగే మండపానికి మామిడి తోరణాలు కట్టారు. శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్న సామూహిక వరలక్ష్మీ వ్రత వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు కోరారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత దుర్గాదేవి దంపతులకు విరాళం బాండ్ పత్రాలను అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విజయవాడకు చెందిన ఇద్దరు భక్తులు గురువారం వేరువేరుగా రూ.2,01,232 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా సుంకర దుర్గాదేవి, శివరామకృష్ణ దంపతులు రూ.1,00,116 ఆలయ డొనేషన్ కౌంటర్‌లో జమ చేయగా, దాతకు ఆలయ ఏఈవో పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు. అలాగే రాంపిల్ల గణపతి రూ.1,01,116 నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేయగా, ఆలయ సూపరింటెండెంట్ డీవీఎస్ రాజు దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

శివ పార్వతులు, గోదా శ్రీకృష్ణుల కల్యాణం



శివపార్వతులు, గోదాశ్రీకృష్ణుల కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఏకకాలంలో శివపార్వతుల కల్యాణం గోదా శ్రీకృష్ణుల కల్యాణం అశ్వారావుపేట రోడ్‌లోని శ్రీ సర్వ మంగళ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో గురువారం నిర్వహించామని విశ్వహిందూ పరిషత్ సభ్యులు కెవీఆర్ సత్యనారాయణ తెలిపారు. బ్రహ్మశ్రీ మోరపాకల శివరాం వ్యాఖ్యానంతో జటావల్లభల రవికుమార్ వేదమంత్రాల నడుమ ఈ కల్యాణం శోభాయమానంగా నిర్వహించామని తెలిపారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారన్నారు.

ఉపాధ్యాయురాలి కుటుంబానికి అండగా ఉంటాం



మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

కామవరపుకోట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తూ, బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రసన్నలక్ష్మి కుటుంబానికి అండగా ఉంటామని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా కుమార్ అన్నారు. గురువారం కొత్తూరులోని మారుతి నగర్‌లో ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావలసిన రాయితీలు, సదుపాయాలను త్వరగా అందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ డి. సుబ్బారావు, టిడిపి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కనుల పండువగా పవిత్రోత్సవాలు



ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం లోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాసుడి దివ్య పవిత్రోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం పవిత్రాధివాసం కార్యక్రమాన్ని అర్చకులు వేడుకగా నిర్వహించారు. ముందుగా అర్చకులు ఆలయ యాగశాలలో పవిత్రాలను ఉంచి, ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యా హవాచనను నిర్వహించారు. అనంతరం పంచగవ్య ప్రోక్షణ చేసి అగ్ని ప్రతిష్ఠాపన నిర్వహించారు.



జూనియర్ వైద్యురాలి ఘటన బాధాకరం



జంగారెడ్డిగూడెం రూరల్: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన చాలా బాధాకరం. ప్రజల ప్రాణాలను రక్షించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది సేవలందిస్తుంటారు. మహిళా వైద్యుల రక్షణతో పాటు, మహిళా వైద్య సిబ్బందికి రక్షణ కల్పించేందుకు కఠినమైన చట్టాలు రూపొందించి, అమలు చేయాలి. కోల్‌కతాలోని ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ సౌజన్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి, తాడువాయి

ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి



కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారం సంఘటనతో దేశం మొత్తాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఆ సంఘటన తర్వాత మహిళా ఉద్యోగులకు, ముఖ్యంగా రాత్రి, పగలు తేడా లేకుండా పనిచేస్తున్న వైద్య ఉద్యోగులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి. అలాగే ఆసుపత్రుల వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి. మహిళలపై దాడి చేసే వారిని వెంటనే శిక్షించేలా ప్రత్యేక చట్టాలు రూపొందించాలి. అలాగే మహిళలపై లైంగిక దాడులకు పాల్పడే వ్యక్తులకు కఠినమైన శిక్షలు విధించాలి.

– డి.సరళా ప్రకాష్, ఏఎన్ఎం, పాలకొల్లు రూరల్

జయహో గణనాయకా..!



విక్రయానికి సిద్ధం చేసిన వినాయక విగ్రహాలు



భారీ విగ్రహాలను లారీలోకి ఎగుమతి చేస్తున్న వ్యాపారులు

చవితికి ముస్తాబవుతున్న వినాయక విగ్రహాలు

చింతలపూడి: గణేష్ నవరాత్రి ఉత్సవాలకు వినాయక విగ్రహాలు ముస్తాబవుతున్నాయి. చింతలపూడి నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రారంభమయ్యే గణపతి సంబరాలకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నాయి. ఉత్సవాలకు అవసరమైన వినాయకుడి విగ్రహాలను హైదరాబాద్, సూర్యాపేట, విజయవాడ పట్టణాల నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. స్థానికంగానూ వివిధ ఆకృతుల్లోని గణేష్ విగ్రహాలను వ్యాపారులు సిద్ధం చేశారు. 10 సంవత్సరాలుగా గణేష్ విగ్రహాలను ఇక్కడి వ్యాపారులు తీసుకొచ్చి, చింతలపూడి చుట్టు పక్కల ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. విగ్రహం సైజ్‌ను బట్టి రూ.3,000 నుంచి రూ.25 వేల వరకు విక్రయిస్తున్నట్లు వ్యాపారి ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. అయితే విగ్రహాలను దూర ప్రాంతాల నుంచి తీసుకు రావడం వలన రవాణా భారం పెరిగిందంటున్నారు. అదే విధంగా ఇతర రాష్ట్రాల నుంచి విగ్రహ తయారీదారులను తీసుకొచ్చి, విగ్రహాలను ఇక్కడే తయారు చేయించడం వలన కూడా అధిక వ్యయ ప్రయాసలు పడుతున్నామని తెలిపారు. ఇదిలా ఉండగా ఏటా వినాయక విగ్రహాలను స్థానిక పెద్ద చెరువు, నాగిరెడ్డిగూడెం సమీపంలోని తమ్మిలేరు ప్రాజెక్టులో నిమజ్జనం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు ప్రాజెక్టు అధికారులు ఈ విగ్రహాలను తొలగించకపోతే నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మట్టి విగ్రహాలు సరఫరా చేయాలి



గణేష్ నవరాత్రి ఉత్సవాలను దష్టిలో పెట్టుకొని మట్టి విగ్రహాలను భక్తులు వినియోగించాలి. దీని వలన విగ్రహాలను నిమజ్జనం చేసినప్పుడు నీరు కలుషితం కాదు. పర్యావరణ సమస్య తలెత్తదు. స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి, భక్తులకు మట్టి విగ్రహాలు సరఫరా చేయాలి.

ఎస్‌కే ఆజాద్‌బాబు, అజీమ్ చారిటీ ఫౌండేషన్ చైర్మన్

జాగ్రత్తలు తీసుకుంటాం



వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరగడానికి అన్ని చర్యలు తీసుకుంటాం. ఉత్సవ కమిటీల నిర్వాహకులు పోలీస్ వారి నిబంధనలు పాటించాలి. ముఖ్యంగా నిమజ్జన సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ఎం.కుటుంబరావు, ఎస్సై, చింతలపూడి

బొత్సను కలిసిన జెడ్పీటీసీ రమేష్



బొత్స సత్యనారాయణను కలిసిన జెడ్పీటీసీ రమేష్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కామవరపుకోట: మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను గురువారం జెడ్పీటీసీ రమేష్ విశాఖపట్నంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూరకంగా కలిశారు. మండలంలోని పలు అంశాల గురించి జెడ్పీటీసీ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ప్రతీ కార్యకర్త ధైర్యంగా పార్టీ పటిష్ఠతకు ముందుకు సాగాలని, రానున్నవి వైఎస్సార్‌సీపీకి మంచి రోజులని బొత్స జెడ్పీటీసీకి సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గంగుల కడియాలు, రాజశేఖర్, ఈదర ఆంజనేయులు పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సాయం



అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం చేస్తున్న మానవత సభ్యులు

కొయ్యలగూడెం: పొంగుటూరుకు చెందిన మర్రి శామ్యూల్ అనే వ్యక్తికి కొయ్యలగూడెం మానవత శాఖ గురువారం రూ.5 వేలు ఆర్థిక సాయమందించింది. ప్యాంక్రియాసిస్ (క్లోమం) దెబ్బ తిని అనారోగ్యంతో బాధపడుతున్న శామ్యూల్ విషయం సంస్థ సభ్యులకు తెలవడంతో అతడికి మందుల ఖర్చు నిమిత్తం ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు మాటూరు సుధీర్, ఉపాధ్యక్షుడు మందపాటి రామకృష్ణ, ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, వీఎస్ఎన్ స్వామి, తిగిరిపల్లి చంటి పాల్గొన్నారు.

శాకంబరీ దేవిగా కనకదుర్గమ్మ



శాకంబరీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ

కొయ్యలగూడెం: శ్రావణ మాసం సందర్భంగా గురువారం నరసన్నపాలెం వై జంక్షన్ కనక దుర్గమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో శాకాంబరీదేవిగా అలంకరించారు. శుక్రవారం అమ్మవారిని భక్తుల దర్శనార్థం శాకాంబరీదేవి అలంకరణతో ఉంచుతామని లక్ష్మణశాస్త్రి తెలిపారు.

శ్రీవారి కొండపై పారిశుద్ధ్యం అధ్వానం



కొండపైన కాటేజీ పక్కన ఇలా..



కొండపైన అన్నదాన సదనం, ప్రసాదాల కౌంటర్ వద్ద పేరుకున్న చెత్త

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపై పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. ఉదయం 8 గంటల సమయంలోనూ ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. వివాహాలు జరిగే సమయంలో పారిశుద్ధ్యం మరింత దిగజారుతుందని పలువురు అంటున్నారు. క్షేత్రంలో బుధవారం రాత్రి స్వల్ప సంఖ్యలో వివాహాలు జరిగాయి. అయితే పెళ్లి వారు పడవేసిన చెత్త, చెదారాన్ని ఉదయం 8 గంటలు అయినా పారిశుధ్య సిబ్బంది తొలగించలేదు. దీంతో భక్తులు ముక్కు మూసుకొని అటుగా సంచరించాల్సి వచ్చింది. విష జ్వరాలు వ్యాపిస్తున్న ప్రస్తుత సమయంలో పారిశుద్ధ్యం ఇలా ఉంటే ఎలా అని పలువురు భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని కోరుతున్నారు.

పోలవరం పనుల పరిశీలన



పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పరిశీలించారు. ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించి, పనుల వివరాలను సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈయన వెంట కొణతాల ప్రసాద్, కరిబండి నాగరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

జంగారెడ్డిగూడెం: ఈ నెల 31న ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్ తెలిపారు. ప్రతీ నెలా 1న పింఛన్ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తుండగా, సెప్టెంబర్ 1 ఆదివారం అయినందున ఆగస్టు 31 శనివారం పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

మహిళపై దాడి.. వ్యక్తిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మహిళపై దాడి చేసిన ఘటనలో ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివీ.. చిరుగుపల్లి సంధ్యారాణి అనే మహిళ పట్టణంలోని పేరంపేట రోడ్డులో నివాసం ఉంటోంది. ఈమె భర్త నుంచి విడిపోయి 2 సంవత్సరాలుగా ఇక్కడే ఉంటోంది. ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో సంధ్యారాణి చెల్లెలు రిబ్కా తోడుగా ఉంటోంది. ఈ నెల 28న యాదాల స్వరూప్ రిబ్కాను కలిసేందుకు సంధ్యారాణి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో రిబ్కాతో స్వరూప్ గొడవ పడుతుండగా, సంధ్యారాణి అడ్డు వెళ్లింది. దీంతో కోపోద్రిక్తుడైన స్వరూప్ బ్లేడ్‌తో సంధ్యారాణిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన సంధ్యారాణిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, సంధ్యారాణి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉప్పాకపాడులో శ్రీకృష్ణుడి ఊరేగింపు

ఉంగుటూరు: ఉప్పాకపాడు గ్రామంలో శ్రీకృష్ణుని ఊరేగింపు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక తాడేపల్లిగూడెం కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా ఈనెల 26న మాకా నాగేశ్వరరావు ఇంటివద్ద ఏర్పాటు చేసిన వేదికపై శ్రీకృష్ణుని ప్రతిమను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజ లు చేస్తున్నారు. భగవద్గీత శ్లోక పారాయణం చేశారు. శ్రీకృష్ణుని ఊరేగింపులో కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఎం కోటేశ్వరావు, సీహెచ్ అశోక్, రామారావు, జయలక్ష్మి పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల నిర్వహణ గిరిజనులకు అప్పజెప్పాలి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ జేఏసీ నాయకులు

కుక్కునూరు: మండలంలోని ఇసుక ర్యాంపుల నిర్వహణ పీసా గ్రామసభలు నిర్వహించి గిరిజన సొసైటీలకు అప్పగించాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో గిరిజన సొసైటీలకు ఇసుక రీచ్‌ల నిర్వహణ అప్పగించాలని కోరుతూ కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయంలో, ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ షెడ్యూల్ ఏరియాలో గిరిజనులకు పీసా గ్రామసభ స్వయంప్రతిపత్తి కల్పిస్తుందన్నారు.పీసా గ్రామసభ ద్వారా గిరిజన సొసైటీని ఎంపిక చేసి ఇసుక రిచ్‌లను నిర్వహించేలా మైనింగ్ అధికారులు అనుమతులివ్వాలన్నారు. అంతేకాక వర్షాకాలం పూర్తయ్యే వరకు ఇబ్రహీంపేట గ్రామంలోని ఇసుక స్టాక్ పాయింట్ వద్ద మిగిలిన ఇసుకను స్థానిక అవసరాల కోసం ఉంచి ఇతర ప్రాంతాలకు తరలించకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ నాయకులు వర్సా నాగేశ్వరావు, రఘు, వర్సా పాపారావు, కంగాల కల్లయ్య,ఎస్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాష, క్రీడా దినోత్సవాలు

గిడుగు, ధ్యాన్ చంద్ చిత్ర పటాలకు పలువురి నివాళి



టి.నరసాపురం: తెలుగు భాషాదినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



కుక్కునూరు: కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయినులు



జంగారెడ్డిగూడెం: సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థినులు

టి.నరసాపురం: స్థానిక విజన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు తెలుగు భాషా దినోత్సవం (గిడుగు రామ్మూర్తి జయంతి), జాతీయ క్రీడా దినోత్సవం (మేజర్ ధ్యాన్ చంద్ జయంతి) వేడుకలు పాఠశాల కరస్పాండెంట్ పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ×గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు భాషను వ్యవహారిక భాషలోకి మార్చాలని కృషి చేసిన మహనీయుడు గిడుగు రామమూర్తి పంతులు అని కొనియాడారు. తెలుగు భాషను ×ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్¥, అజంతా భాష్ట అంటారన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

భారత హాకీ ఇంద్రజాల నైపుణ్యాన్ని ప్రపంచమంతా చాటి చెప్పి, దేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకు వెళ్లిన ఘనత మేజర్ ధ్యాన్ చంద్‌దేనన్నారు. విద్యార్థులు కేవలం చదువులోనే కాక క్రీడలలోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: వాడుక భాషోద్యమ నాయకుడు గిడుగు రామమూర్తి పంతులు జన్మ దినోత్సవ సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని ప్రతిభ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కాసర లక్ష్మీసరోజా రెడ్డి మాట్లాడుతూ ఎన్ని భాషలు నేర్చుకున్నప్పటికీ అమ్మ భాషను నిర్లక్ష్యం చేయడం క్షమించరాని నేరమన్నారు. శ్రీకృష్ణదేవరాయల వేషధారణలో విహాన్ కనువిందు చేశాడు. అష్టదిగ్గజ కవులతో భువన విజయాన్ని ప్రదర్శించారు. పలువురు విద్యార్థులు తెలుగుతనం ఉట్టిపడే విధంగా అలంకరించుకొని నృత్యాలను చేశారు. విద్యావికాస్ పాఠశాలలో ప్రిన్సిపాల్ పి.సతీష్‌చంద్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. కావ్య శ్రీ లీల తెలుగుతల్లి వేషధారణలో అలరించింది. విద్యార్థులు తమ పలకల మీద తెలుగు అక్షరాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వెంకట్రావు, పూర్ణిమ, అనిత, దీపిక, విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కునూరు: జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం మండలంలోని వేలేరు కేజీబీవీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్ఓ సునీత మాట్లాడుతూ భారత క్రీడాకారులకు పరిచయం అక్కరలేని పేరు ధ్యాన్ చంద్ అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు ఉమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని మండలంలోని గుణ్ణంపల్లి జెడ్పీ ఓరియంటల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.వర ప్రసాద్ అన్నారు. స్థానిక పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎన్.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు 161వ జయంతి వేడుకలు గురువారం అభిమానులు ఘనంగా నిర్వహించారు. శాఖా గ్రంథాలయంలో తెలుగులో వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు అని లైబ్రేరియన్ యు.రాముడు పేర్కొన్నారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు అలంకరించి నివాళులర్పించారు. అదేవిధంగా కుంతలగూడెం ఎంపీపీ స్కూల్లో హెచ్ఎం రాయపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి జయంతికి విద్యార్థులు నివాళులు అర్పించి ఆయన చిత్రానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

తెలుగు పదంలోనే మాధుర్యం



కామవరపుకోట: గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కామవరపుకోట: మండలంలో రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడి భీమరాజు అధ్యక్షతన, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరి అధ్యక్షతన గురువారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు అనే పదంలో ఎంతో మాధుర్యం ఉందని తెలిపారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.ఇందిరాకుమారి, ధారావతు మల్లేష్, పి.ఏడుకొండలు, ఎం.విజయకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.